క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారాముల ఉత్సవమూర్తులు

కొండాపురం: మండలంలోని కొమ్మి గ్రామంలో గత వారం రోజులుగా సీతారామస్వామి తిరునాళ్లు ఘనంగా జరిగాయి. ఆదివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి సీతారాములకు గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

అంకమ్మ తిరునాళ్లు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి

కొండాపురం: మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో శ్రీకోటా అంకమ్మతల్లి తిరునాళ్ల ఆదివారం ప్రారంభమైంది. వేదపండితులు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, శాంతి హోమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారు నక్క వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సోమవారం గ్రామోత్సవం, మంగళవారం గొట్టిగుండాలపాళెంలో ఊరేగింపు, బుధవారం పెద్ద ఊరేగింపు, గురువారం పొంగళ్లు, బండ్లు తిరగడం, బండలాగుడు పోటీలు జరుగుతాయని తెలిపారు.

పోలేరమ్మకు పొంగళ్లు



పోలేరమ్మ ఆలయానికి తరలివెళుతున్న భక్తులు

సీతారామపురం: మండలంలోని దేవమ్మచెరువు గ్రామంలో కోదండరామస్వామి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తులు పొంగళ్లు సమర్పించారు. తొలుత మహిళలు పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా మాతా పరమేశ్వరి జాతర



పెన్నానది నుంచి కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

సంగం: స్థానిక నిమ్మతోపు సెంటర్ సమీపంలో ఉన్న ఎస్సీకాలనీలో శ్రీమాతా పరమేశ్వరి ఆలయంలో జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మహిళలు భక్తిశ్రద్ధలతో పెన్నానది నుంచి కలశాలతో జలాలను తీసుకుని ఊరేగింపుగా మాతా పరమేశ్వరి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారు ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా అశోక్‌రెడ్డి



మల్లవరపు అశోక్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: తాడేపల్లిగూడెంలో జరుగుతున్న ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆదివారం తనను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని ఆత్మకూరు నియోజకవర్గంలోని రాంపల్లికి చెందిన మల్లవరపు అశోక్‌రెడ్డి తెలిపారు. ఏబీవీపీలో క్రియాశీలకంగా పనిచేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించిన నేపథ్యంలో విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని తెలిపారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా..

- పీహెచ్‌సీల్లో వైద్యసేవలు
- అందుబాటులో అధునాతన పరికరాలు
- 64 రకాల వైద్యపరీక్షలు, 175 రకాల మందులు



జలదంకిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జలదంకి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రోగులకు మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. రోగులకు పూర్తి స్థాయిలో వైద్యపరీక్షలు నిర్వహించేందుకు వీలుగా వైద్య ఆరోగ్య శాఖ అధునాతన పరికరాలను అందజేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్కో పీహెచ్‌సీకి సీబీసీ, ఎలక్ట్రోలైట్, ఎనలైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్ యంత్రాలను సమకూర్చింది. గతంలో పీహెచ్‌సీల్లో 10 నుంచి 15 రకాల వైద్యపరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండగా.. ఇప్పుడు 64 రకాల వైద్యపరీక్షలు చేసేందుకు వీలు కలిగింది. మరోవైపు పీహెచ్‌సీల్లో 175 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో పీహెచ్‌సీల్లో అంతంత మాత్రమే వైద్యసేవలు అందేవి. రోగులకు అవసరమైన అన్ని వైద్యపరీక్షలు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం రోగులు కమ్యూనిటీ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీహెచ్‌సీల్లో వైద్యపరీక్షల సంఖ్య పెరగడంతోపాటు దాదాపు అన్ని రకాల మందులు అందుబాటులోకి వచ్చాయి.

పల్లె చెంతకే వైద్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులను నాడు–నేడు కార్యక్రమం ద్వారా ఆధునికీకరించి పల్లె చెంతకే వైద్యాన్ని తీసుకువచ్చింది. ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాలతో పేదల ఇంటి వద్దకే వైద్యం అందించేలా చర్యలు తీసుకుంది. ప్రస్తుతం అన్నిరకాల వైద్యపరీక్షలు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండడంతో రోగులకు వ్యయప్రయాసలు తప్పాయి. పీహెచ్‌సీలకు అధునాతన వైద్యపరికరాలు అందించడంతోపాటు వైద్యపరీక్షల కోసం ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను ప్రభుత్వం నియమించింది. గంటల వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకునే అవకాశం కలగడంతో సకాలంలో మెరుగైన వైద్యసేవలు పొందేందుకు అవకాశం ఉంది. పీహెచ్‌సీల్లో సీఆర్‌పీ, హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, ర్యాండమ్ బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్‌ఐవీ, హెపటైటిస్, డెంగీ, బ్లీడింగ్, థైరాయిడ్ తదితర పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని పీహెచ్‌సీల్లో ఈ సేవలు అందుతున్నాయి. ప్రజలు పీహెచ్‌సీలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

నిముషాల వ్యవధిలో రోగ నిర్ధారణ



పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు అవసరమైన వైద్యపరీక్షలు చేస్తున్నాం. నిమిషాల వ్యవధిలోనే రోగ నిర్ధారణ చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోకుండా ప్రభుత్వ వైద్యశాలల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యాధికారి, జలదంకి

హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహిద్దాం



కరపత్రాలను ప్రదర్శిస్తున్న హిందూ చైతన్య వేదిక సభ్యులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలో జూలై 21న సాయంత్రం 3 గంటలకు హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహిద్దామని, ప్రతి ఒక్కరూ తమవంతు సేవలు అందించాలని హిందూ చైతన్య వేదిక ఆత్మకూరు కార్యవర్గ సభ్యులు కోరారు. పట్టణంలోని టెంకాయతోపులో ఉన్న కృష్ణమందిరంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. జూలై 21న ఆత్మకూరు బైపాస్ రోడ్డులో గల అభయాంజనేయస్వామి ఆలయం నుంచి పాత సినిమా హాలు మీదుగా సత్రం సెంటర్, చావడి, ఎరుకలసానినగర్, సోమశిల రోడ్డు సెంటర్ మీదుగా ఆర్టీసీ డిపో వరకు వెళ్లి తిరిగి ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ మీదుగా అభయాంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలు, కర్రసాము, కోలాటం ప్రదర్శన, కేరళ డ్రమ్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గంగమ్మ తల్లికి పాలపొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

సోమశిల: అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల గ్రామ చెరువు కట్ట సమీపంలో వెలసిన శ్రీగంగమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం పాల పొంగళ్లు పొంగించారు. ఆలయ నిర్మాణం జరిగి సంవత్సరం కావడంతో భక్తిశ్రద్ధలతో పాలపొంగళ్లు పొంగించారు. తొలుత మహిళా భక్తులు కొత్త గంపల్లో పొంగలి సామగ్రి, పూజా వస్తువులు ఉంచుకుని మంగళ వాయిద్యాల నడుమ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పొంగించారు. అనంతరం గ్రామంలో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన రాచాల వెంకటరామయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు వారి కుటుంబం తరఫున రూ.2.90 లక్షలతో పంచలోహ విగ్రహాలు చేయించారు. నల్లకూనల వెంకటరమణ బంగారు తాళిబొట్టు, వరికుంట ప్రసాద్ కాసుల వెండిబొట్టు అమ్మవారికి చేయించారు. మేకల పెంచలయ్య అమ్మవారికి బంగారు కళ్లు చేయించగా, రాచాల కేశయ్య శఠగోపం చేయించారు. భక్తులు ఈ ఆభరణాలు, సామగ్రిని ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

అంకమ్మ, మల్లెంకొండయ్య దేవర్ల కొలుపు ప్రారంభం



విశేష అలంకారంలో అమ్మవారు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలో శ్రీఅంకమ్మ, మల్లెంకొండయ్య దేవర్ల కొలుపు వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు విద్యావస్తువులకు వీరగంధం పూసి అంకమ్మ మల్లెంకొండయ్య స్వాములకు తొలిపూజ చేశారు. అనంతరం మైలుతుడుపు, పుష్పాలకపిర నిర్వహించి అమ్మవారికి పెన్నా స్నానం చేయించారు. సాయంత్రం నాగేంద్రపురంలోని వినాయకుడి ఆలయం వద్ద నుంచి అమ్మవారి సింహాసనంతో బయలుదేరి మల్లెంకొండయ్య మాను వద్ద విడిది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కలిగిరి: మండలంలోని బొమ్మరాజుచెరువు, నాగిరెడ్డిపాళెం, వీర్నకొల్లు, బసిరెడ్డిపాళెం గ్రామాల్లో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు జి.ప్రసాద్, జి.సుధాకర్, మహేంద్ర, మధు, వెంకటేశ్వర్లు, రమణయ్య, నాగమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో చేర్పించండి



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని నల్లగొండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చవటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుభాషిణి కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలచెన్నయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోవధ జరగకుండా చూడండి



అల్లూరు: గోవధ నిషేధ చట్టం అమలులో ఉన్న కారణంగా అల్లూరు మండలంలో గోవధ జరగకుండా చూడాలని బీజేపీ నాయకులు అల్లూరు పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. గోవులను వధించి విక్రయించే విధానాన్ని అరికట్టాలని, అలాంటి వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్లూరు నవీన్ కుమార్, సాయికృష్ణ, కృష్ణసాయి, కిరణ్‌నాయుడు, మల్లికార్జునసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బుజ్జిరెడ్డి లేని లోటు తీర్చలేనిది



బుజ్జిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించిన కాలం బుజ్జిరెడ్డి లేని లోటు తీర్చలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో బుజ్జిరెడ్డి సంస్మరణసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవలో బుజ్జిరెడ్డి ప్రత్యేకతను చాటుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుడుముల సుధాకర్‌రెడ్డి, నలిశెట్టి శ్రీధర్, కంది మల్లికార్జునరెడ్డి, కరటంపాటి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కొడవలూరు : 30 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న వారంతా ఒక వేదికపైకి చేరారు. అలనాటి ఆనందాలను గుర్తుచేసుకున్నారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. మండలంలోని గండవరం ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. వివిధ ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా సమావేశానికి హాజరయ్యారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ గత స్మృతులను నెమరేసుకుంటూ మూడు గంటల పాటు ఎంతో ఆనందంగా గడిపారు. తరగతి గదిలో కొందరు విద్యార్థులు చేసిన చిలిపి చేష్టలను గుర్తుచేసుకుని ఆనందించారు. ఎవరు ఎలా స్థిరపడ్డారు.. ఎలాంటి ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు.. తదితర విషయాలను పంచుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు వారంతా ఆనందంగా గడిపారు. అనంతరం అందరూ కలిసి సామూహిక భోజనం చేశారు. ప్రతి ఏడాది ఇదేలా విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో కలిసి ఆనందంగా గడుపుదామని ముక్తకంఠంతో స్పష్టం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు జంజ్యం సుధీర్, ఇనమాల శ్రీహరి, గుర్రాల కోటయ్య, షేక్ సాధిక్, జె.శ్రీరాములు, ఒంటేరు ప్రేమ్‌కుమార్, ఆరుద్ర మహేష్, అద్దూరు శీనమ్మ, నాగిరెడ్డి స్వరూప, షాహినా, పి.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలి



మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ముస్లింలు బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తన సందేశాన్ని తెలిపారు. త్యాగాలకు ప్రతీకైన బక్రీద్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముస్లింలు మార్గదర్శకులుగా సేవలు అందించాలని కోరారు.

అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఉదయగిరి: మండలంలోని గన్నేపల్లిలో అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రి గడ్డంవారిపల్లి గ్రామంలో నిలుపుతో ప్రారంభమయ్యాయి. తొలుత మిట్టపల్లి గ్రామం నుంచి గొడుగుల ఉత్సవం ప్రారంభించి గడ్డంవారిపల్లి రామాలయానికి అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ అమ్మవారికి నైవేద్యం సమర్పించి సంప్రదాయబద్ధంగా కొమ్ము, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ప్రత్యేక వాహనంపై గన్నేపల్లికి తరలించారు. కార్యక్రమంలో గడ్డంవారిపల్లి, మిట్టపల్లి,జెట్టివారిపల్లి, కొట్టాలపల్లి సర్వరాబాదు, గన్నేపల్లికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల వితరణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పట్టణంలోని బీసీకాలనీకి చెందిన పేద విద్యార్థులకు స్థానిక చర్చి పాస్టర్ ఏసుదాసు స్థానిక చర్చిలో స్కూలు బ్యాగులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ పేద విద్యార్థులకు తనవంతు సాయంగా బ్యాగులు, నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభమైన గంగాభవాని ఉత్సవాలు

సీతారామపురం: మండలంలోని సింగారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం గంగాభవాని ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారి నిలుపు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే సోమవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పోలేరమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ చంద్రారెడ్డిపాళెంలో గ్రామదేవత పోలేరమ్మతల్లికి గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మహిళలు ఆలయం వద్దకు వెళ్లి సద్దిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. మహిళలు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పొంగించారు. పొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

ముస్లింలకు రేషన్ పంపిణీ



ఉదయగిరి: బక్రీద్ సందర్భంగా ఉదయగిరి పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు ఆదివారం స్థానిక జమాతే ఇస్లామిక్ హింద్, ఎస్‌ఐఓ, జేవైఎం సంస్థలకు చెందిన ప్రతినిధులు రేషన్ సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్, మునాఫ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పౌర సరఫరాలశాఖ గోదాము తనిఖీ



సరుకుల తూకాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలోని పౌర సరఫరాలశాఖ గోదామును ఆర్డీఓ కురుబా మధులత ఆదివారం తనిఖీ చేశారు. ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న పామాయిల్, కందిపప్పు, చక్కెర వంటి తూకాల్లో తేడాలు ఉన్నాయని ఫిర్యాదులు అందాయని, ఈ మేరకు ఆత్మకూరు, ఉదయగిరిలలో గల సివిల్ సప్లయ్స్ గోడౌన్లలో ఆయా సరుకుల తూకాలను పరిశీలించామని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకుల తూకాలు సక్రమంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆమె వెంట సివిల్ సప్లయ్ డీటీ శేషయ్య తదితరులు ఉన్నారు.

తొలకరి జల్లులతో పొంచి ఉన్న జ్వరాలు

కావలి: కావలి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తాత్కాలిక బదిలీలపై వచ్చిన అధికారులు గత మూడు నెలల నుంచి ఎన్నికల విధులకే పరిమితం కావడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తిష్టవేశాయి. తొలకరి జల్లులు, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పారిశుద్ధ్యం లోపించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల నుంచి చెదురుమదురుగా పడుతున్న జల్లులకు అడుగంటిన బావుల్లో కొత్తనీరు చేరడంతోపాటు, కాలువలు, వీధుల్లో మురుగునీరు మడుగులు కడుతున్నాయి. తాగునీటి కాలుష్యం, వాతావరణ మార్పులు, దోమలతో జలుబు, జ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఏ పంచాయతీలో చూసినా వీధుల్లో చేరిన చెత్త కుప్పలు, పేడదిబ్బలు, కాలువల్లో ముందుకు కదలని మురుగునీరు, తాగునీటి బోర్లు, కుళాయిల వద్ద అపరిశుభ్రతతో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కావలి పట్టణం, రూరల్‌తోపాటు అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లోని పలు పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్య స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధానంగా పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్, వైకుంఠపురం, పాతూరు, ఇస్లాంపేట తదితర ప్రాంతాలతోపాటు మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. ఇటీవల కావలి రూరల్ మండలం సర్వాయపాళెం పంచాయతీలో అతిసార ప్రబలిన విషయం తెలిసిందే. ట్యాంకులను శుభ్రం చేయడం, క్లోరినేషన్ ఊసే లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వైఎస్సార్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడం బాధాకరమని బుచ్చిరెడ్డిపాళెం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం పట్టణ నడిబొడ్డున ఉన్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహ ధ్వంసం చేయడానికి దుండగులు ప్రయత్నించడం హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి వాటిని టీడీపీ ప్రోత్సహించడం సరికాదన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రశాంత వాతావరణం ఉందని, ప్రస్తుతం టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయడమే లక్ష్యంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ విగ్రహం ధ్వంసం విషయమై కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తక్షణమే స్పందించి ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, రూరల్ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు పెద్ద అల్లాభక్షు, చిన్న అల్లాభక్షు, శివకుమార్‌రెడ్డి, విజయ్‌భాస్కర్ రెడ్డి, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు హాజరుకండి

అల్లూరు: బక్రీద్ పండగ సందర్భంగా సోమవారం అల్లూరు మసీద్ సెంటర్‌లోని జామీయా మసీద్‌లో ఉదయం 9 గంటలకు, బీసీకాలనీలోని మదీనా మసీద్‌లో 9.30 గంటలకు నిర్వహించే నమాజ్‌కు ముస్లింలు హాజరుకావాలని మసీద్ ప్రెసిడెంట్లు షేక్ సమద్, షేక్ ఆకూర్ తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఉదయగిరి: ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. బక్రీద్ పర్వదినాన్ని ఉదయగిరి నియోజకవర్గంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా ఏర్పాట్లు చేశారు. ఉదయగిరి, వింజమూరు ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నాయకుడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.